క్లుప్తంగా

కరుణించిన వరుణుడు



ఉయ్యాలవాడలో కురుస్తున్న వర్షం

ఉయ్యాలవాడ : వరుణ దేవుడు కరుణించాడు.. ఆకాశంలో మేఘాలు కమ్ముకుని ఉన్నట్లుండి ఆదివారం సాయంత్రం ఉయ్యాలవాడలో మోస్తరు వర్షం కురిసింది. రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విత్తనం వేసేందుకు భూమిలో సరిపడినంత తేమ లేకపోవడంతో చాలా మంది రైతులు విత్తనం వేయలేదు. వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వరుణుడు కరుణించడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు, రబీలో సాగు చేయనున్న పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగ పడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సాగునీరు ఇవ్వండి

నంద్యాల(అర్బన్): కేసీ కెనాల్ ద్వారా వెళ్తున్న నీటిలో కొంత వాటాను తమకు కేటాయించాలని నంద్యాల మండల రైతులు ఆదివారం కేసీ కెనాల్ ఏఈ వెంకటేశ్వర్లును కోరారు. తమకు సాగునీరు ఇవ్వాలంటూ మిట్నాల, ఏ.శివరాంపురం, బి.శివరాంపురం, పుసులూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు పొన్నాపురం స్లూయిస్ గేట్ల వద్ద కేసీ కెనాల్ ఏఈని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మిట్నాల రైతులు చిన్నతిరుపతిరెడ్డి, గోపాల్ రెడ్డి, రాజేష్, లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడుతూ కేసీ కెనాల్ నీరు కింది ప్రాంతాలకు అధిక మొత్తంలో వెళ్తుందని, తమ పంటలకు కొంత వాటా కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ



బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా పడిఉన్న దృశ్యం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్‌జీఓ కాలనీలో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిశోర్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కిశోర్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా వర్క్‌ఫ్రమ్ హోం కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం కడపలో బంధువులను కలిసేందుకు భార్య, పిల్లలతో కలిసి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అయితే దొంగలు ఎంత సొత్తు దోచుకెళ్లారనే వివరాలను కిశోర్ సరిగా వెల్లడించటంలేదని, కేసు నమోదు చేసి విచారిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

చంద్రపుల్లారెడ్డిని ఆదర్శంగా తీసుకోండి



చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): చంద్రపుల్లారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధనకు ఉద్యమిద్దామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో అమరవీరుల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చంద్ర పుల్లారెడ్డి, పైలా వాసుదేవరావు, చార్ మంజూందర్, నీలం రామచంద్రయ్య, రామ్ నర్సయ్య తదితరులు నవంబర్ మొదటి మాసంలో విప్లవ ఉద్యమంలో అమరులయ్యారన్నారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎండీ రఫీ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చౌడప్ప, మహమ్మద్, రఫీ, మాబాషా, ఆనంద్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో పారిశుద్ధ్య పనులు

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం డోజర్‌తో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో 350 మంది విద్యార్థులు ఉన్నారని, వారి ఆరోగ్యం కోసం పరిసరాలను శుభ్రం చేయిస్తున్నామని చెప్పారు.

గోవిందపల్లె.. అభివృద్ధి ముల్లె

- అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సదుపాయం కల్పన
- 'నాడు–నేడు' కింద పాఠశాలల్లో సదుపాయాలు
- రూ.60 లక్షలతో ఆయకట్టు రోడ్లు పూర్తి
- జగనన్న కాలనీలో 370 మందికి ఇళ్లు మంజూరు, జోరుగా నిర్మాణాలు
- వివిధ పథకాల ద్వారా గ్రామస్తు ఖాతాల్లో రూ.40.20 కోట్లు జమ
- ఇసుకపల్లె వరకు తారు రోడ్డు ఏర్పాటుకు రూ.5.30 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు







ఆయకట్టు రోడ్డును బాగు చేసిన దృశ్యం

శిరివెళ్ల: నంద్యాల– ఆళ్లగడ్డ రహదారి అనుకొని ఉన్న గోవిందపల్లె గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే, జెడ్పీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు, గ్రామ సచివాలయ భవనం, మన బడి నాడు– నేడు కింద పాఠశాలలను తీర్చిదిద్దారు. ఇంకా పలు పనులు కార్యరూపం దాల్చుతున్నాయి.

అభివృద్ధి పనులు ఇలా..

- రూ. 45 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తి.
- ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని గ్రామంలోని ప్రధాన వీధి రోడ్డును సీసీ రోడ్డుగా మార్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 50 లక్షలతో సిమెంట్ రోడ్డు, రూ.1.20 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా నూతన డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని 75 శాతం ప్రజలు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా మారినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు.
- పంచాయతీ నిధులు రూ.40 లక్షలతో ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించారు.
- మన బడి నాడు– నేడు కింద రూ. 38 లక్షలతో జెడ్పీ ఉన్నత పాఠశాల, రూ.15 లక్షలతో ప్రధాన ప్రాథమిక పాఠశాల, రూ.11 లక్షలతో మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు.
- రైతు సంక్షేమం కోసం రూ.60 లక్షల వరద నిధులతో 5 ఆయకట్టు రోడ్లు వేశారు. దీంతో రైతన్నలకు పొలాలకు రాకపోకలు సాగించేందుకు కష్టాలు తొలిగిపోయాయి.



రూపుదిద్దుకున్న జెడ్పీ ఉన్నత పాఠశాల

- జగనన్న కాలనీలో అర్హులైన 370 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వారందరికీ పక్కా గృహాలు మంజూరయ్యాయి. నిర్మాణాలు జరుగుతున్నాయి.

ప్రతి ఇంటా సంక్షేమమే..

గ్రామంలో అభివృద్ధి ఇలా ఉండగా, సంక్షేమం పరుగులుతీసింది. 2019 నుంచి ఇప్పటి వరకు అమ్మ ఒడి, చేయూత, ఆసరా, విద్యా కానుక, రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక, విద్యా దీవెన, ఈబీసీ నేస్తం వంటి 25 పథకాల కింద గ్రామంలోని లబ్ధిదారులకు రూ.40.20 కోట్లు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. ప్రతి ఇంటికి సగటున రెండు నుంచి ఆరు పథకాలు అందాయి.

కార్యరూపం దాల్చనున్నవి..

- జాతీయ రహదారి నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా ఇసుకపల్లె వరకు తారు రోడ్డుకు రూ. 5.30 కోట్లు మంజూరవగా ఇప్పటికే టెండర్లు పూర్తియయ్యాయి. త్వరలో పనులు మొదలు కానున్నాయి.
- గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ. 40లక్షలు మంజూరయ్యాయి. స్థానికుల విజ్ఞప్తి మేరకు అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్ సదుపాయాల పనులు చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో గ్రామంలో చాలా అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామ సచివాలయం కట్టాం. సిమెంట్ రోడ్లు వేశాం. రైతుల పొలాలకు రోడ్లు వేయించాం. నవరత్నాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చాం. ఇంకా పనులు చేస్తాం. కొన్నింటికి ప్రతిపాదనలు పంపాం, మరికొన్నింటికి నిధులు త్వరలో విడదలవుతాయి. – మరియమ్మ సర్పంచు

రోడ్డు కష్టాలు తీరాయి



గ్రామంలో రెండు ప్రధాన వీధులు ఉన్నాయి. అందులో ఎస్సీ కాలనీ మీదుగా వెళ్లే రోడ్డు 1998లో వేశారు. కాలక్రమేణా అది దెబ్బతిని 20 ఏళ్లకు పైనే అయ్యింది. వానా కాలంలో గుంతల్లో వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. అధిక శాతం రాకపోకలు ఈ రోడ్డుమీదుగా సాగుతాయి. ఇప్పటికే చాలా సార్లు అధికారులను కోరినా రోడ్డు వేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు వేయడంతో పాటు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రోడ్డు ఇబ్బందులు తప్పాయి. – వెంకటరమణ, గ్రామస్తుడు

పొలాలకు రోడ్లు వేశారు



మా గ్రామానికి నాలుగు దిక్కులా పొలాలుండగా వాటికి కట్టురోడ్లు ఉన్నాయి. అవి నాలుగేళ్ల కిత్రం కురిసిన పెద్ద వానకు దెబ్బతిన్నాయి. దీంతో పొలాలకు పోవాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డికి చెబితే రోడ్లు వేయించారు. ఇప్పుడు నేరుగా మా బండ్లు, మోటార్ సైకిళ్లపై పొలాలకు వద్దకు సులభంగా వెళ్లగలుగుతున్నాం. – నరసింహారెడ్డి, రైతు

సామాజిక స్పృహ పెంపొందించేందుకే 'బాలోత్సవ్'



మాట్లాడుతున్న శంకరయ్య

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో సామాజిక స్పృహ, అభ్యుదయ ఆలోచనను పెంపొందించేందుకే నంది బాలోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమరావతి బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి రామరాజు అన్నారు. ఆదివారం నంది బాలోత్సవ కార్యక్రమం విజయవంతం కోసం ఆహ్వాన సంఘం సమావేశం రామకృష్ణ డిగ్రీ కళాశాల మినీ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భగత్‌సింగ్ గ్రంథాలయం సంస్థ చైర్మన్ న్యాయవాది బి.శంకరయ్య అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బాలోత్సవ కార్యక్రమంలో సబ్ జూనియర్, సీనియర్స్ మూడు విభాగాల్లో 40 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 15 రంగాలు, సాంస్కృతిక పోటీలు, 25 అకాడమిక్ పోటీలు చేపడుతున్నామన్నారు. పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను బయటకు తీయడం కోసం నంది విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవాన్ని డిసెంబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి గోపాల్, క్రాంతికుమార్, కన్వీనర్ రామరాజు, నాగేష్, మౌలాలి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్, గురుస్వామి, మాదాల శ్రీనివాసులు, నరసింహ, దస్తగిరి పాల్గొన్నారు.

వివాదాస్పదమైన బోనాల సమర్పణ



గంగమ్మకు బోనాలతో వెళ్తున్న వారిని అడ్డుకున్న దృశ్యం

దొర్నిపాడు: మండల కేంద్రంలో కులమతాలకు అతీతంగా వర్షం కోసం ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించాలని గ్రామస్తులు నిర్ణయించారు. దీంతో గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామస్తులు అధికసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే గ్రామంలోని ఓ కాలనీ వద్దకు రాగానే ఇక్కడ తప్పెట్లు కొట్టరాదని అడ్డుకున్నారు. ఇందుకు భక్తులు వెనక్కు తగ్గకపోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఇరువర్గాలు తోపులాడుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే ఎస్‌ఐ తిరుపాల్ ఘటనా స్థలానికి చేరుకొని వివాదాన్ని సద్దుమనిగేలా చేశారు. మొత్తానికి కట్టుబాట్లకు అనుగుణంగా బోనాల కార్యక్రమాన్ని ముగించారు.

కొత్తూరులో తగ్గిన భక్తుల రద్దీ





నాగులకట్టకు పూజలు చేస్తున్న భక్తులు, అడిషినల్ ఎస్పీ దంపతులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న సిబ్బంది, అర్చకులు

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో దర్శించుకున్నారని ఈఓ రామకృష్ణ తెలిపారు. అష్టమి సందర్భంగా గతంలో కంటే భక్తుల రద్దీ తగ్గిందని చెప్పారు. దాదాపుగా 2వేల మంది స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. దర్శనానికి గంట నుంచి గంటన్నర వరకు సమయం పట్టిందన్నారు. శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయంలో ఆదివారం నంద్యాల జిల్లా ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు కుటుంబ సమేత పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ చరిత్ర గురించిఅర్చకులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకారంలో భక్తులరద్దీ

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అనంతరం మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే నవనందుల్లోని కృష్ణనంది, శివనంది క్షేత్రాల్లో భక్తులు పూజలు చేపట్టారు. ఆలయ పరిసరాల్లోని నల్లమల అందాలు భక్తులు, పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు సమర్పించుకోవాలని సూచించారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): అమరవీరుల స్మారక సభలను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లాల నాయకుడు రంగనాయకులు కోరారు. ఆదివారం స్థానిక గోకారి భవన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ సభ బొల్లవరం గ్రామంలో ఈనెల 6వ తేదీన వేంపెంట గ్రామంలో చంద్రపుల్లారెడ్డి స్థూపం వద్ద నిర్వహిస్తున్నామని చెప్పారు. 9వ తేదీన బహిరంగ సభ, ర్యాలీ ఉంటుందన్నారు. సభకు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరవుతారని, అరుణోదయ కళాకారులు ప్రదర్శన ఉంటుందని వివరించారు. నాయకులు సుబ్బన్న, సాయి, మహిళలు నాగమ్మ, దేవమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

ఉచిత బియ్యం పొడిగించడంపై హర్షం

నంద్యాల(వ్యవసాయం): గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకంలో భాగంగా పేదలకు ఉచిత బియ్యం పంపిణీ మరో ఐదేళ్ల పాటు పొడిగించడంపై నంద్యాల జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు తాడి రామకృష్ణారెడ్డి ప్రధాన మంత్రి మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, గురుబ్రహ్మం, బ్రహ్మనందరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఎలక్టోరల్ అధికారిణి అనురాధ



ఉయ్యాలవాడ పోలింగ్ కేంద్రం వద్ద దరఖాస్తు స్వీకరిస్తున్న బూత్ లెవెల్ అధికారి

నంద్యాల(అర్బన్): 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు పొందేలా చూడాలని నంద్యాల నియోజకవర్గ ఎలక్టోరోల్ అధికారిణి అనురాధ తెలిపారు. పట్టణంలోని బైర్మల్ వీధి మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ఆదివారం నిర్వహించిన స్పెషల్ కాంపైన్‌డేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఫారం–6, 7, 8, 6బీ తప్పని సరిగా తీసుకోవాలని, డిలేషన్‌లో మిస్ అయిన వాటిని తప్పకుండా తొలగించాలని, ఓటర్ల నమోదులో పక్కాగా ఉండాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ యుగంధర్‌రెడ్డి, ఎన్నికల డీటీ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ చంద్ర నాయక్ ఉన్నారు.

ఓటరు నమోదుకు 62 దరఖాస్తులు

ఉయ్యాలవాడ : మండలంలో శని, ఆదివారం రెండు రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదుకు యువతీ, యువకుల నుంచి 62 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫారం–6 కింద 39 మంది యువకులు, యువతులు 23 మంది ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే ఫారం–8 కింద పేరు మార్పు కోసం ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 2024జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీఆర్‌ఓ రవిప్రసాద్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

గోస్పాడు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20శాతం కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కేజీబీవీల్లో వార్డెన్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారావు, భాస్కరరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవార్ల దర్శనం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 560 క్యూసెక్కుల నీటి సరఫరా

జూపాడుబంగ్లా: తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కర్నూలు–కడప కాల్వ ఏఈ లు నరేష్, శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు 1,330 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,100 క్యూసెక్కుల నీరు చేరుతుండగా తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 560 క్యూసెక్కులు, అలగనూరు రిజర్వాయర్ కాల్వకు 40 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ఈ నెలాఖరు వరకు మాత్రమే కేసీ కాల్వకు నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి పొదుపుగా వినియోగించుకోవటంతో పాటు తక్కువ నీటి వనరులతో పండే పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.

మహిళలు నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న మహిళలు,



నారీశక్తి సమ్మేళనాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ సత్యశివసుందరి

నంద్యాల(వ్యవసాయం): మహిళలు నాయకత్వ పటిమ, నిర్ణయ సామర్థ్యం పెంపొందించుకొని సర్వశక్తి మంతులు, స్వతంత్రులుగా ఎదగాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఖాదరబాద్ సత్యశివ సుందరి, నంద్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ స్వర్ణలత, విజయభారతి సూచించారు. ఆదివారం స్థానిక చామకాల్వ రోడ్డులోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా స్థాయి నారీ శక్తి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం కలిగించడం ద్వారా భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను పరిరక్షించడం, దేశ సమగ్ర అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, వివిధ రంగాల్లోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనాలన్నారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం నారీ శక్తి సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అనంతరం విద్యా, వైద్య, సామాజిక, ధార్మిక సేవా, ఉద్యోగ వ్యాపార, వ్యవసాయ పారిశ్రామిక క్రీడ, రాజకీయ, పత్రికా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో మధుకుమారి, మురళీ కల్యాణి, శైలజా, సంధ్య, ఇందుమతి, జ్యోతి, లీలావతి పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

శిరివెళ్ల: ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయి. ఈ మేరకు ప్రజలకు పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం చేరవేస్తుంది. ఏఏ పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి పొందుతున్నారు అనే దానిపై ప్రభుత్వ వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి ఎంతమేర లబ్ధి పొందారనే అనే విషయంపై బుక్‌లెట్ అందజేసి వివరిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి పొందారు అన్న దానిపై ప్రత్యేకంగా ఒక రశీదు పుస్తకాన్ని ముద్రించింది. దానిని సచివాలయాల ద్వారా వలంటీర్లు తమకు కేటాయించిన 50 కుటుంబాలకు వెళ్లి వారికి రశీదు ఇచ్చి సంతకాల సేకరిస్తున్నారు. మండలంలో ఈ ప్రక్రియ మొదలైంది. అలాగే ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఎంత మందికి ఏఏ పథకాల ద్వారా నాలుగున్నర ఏళ్లలో ఎంత అందజేసిందనే వివరాలతో డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు ముమ్మరంగా సాగుతుంది. పథకాల అమలులో పారదర్శకత కోసమే ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



పథకాల రశీదు పుస్తకం, సచివాలయంలో పథకాల అమలు డిస్‌ప్లే బోర్డు



శిరివెళ్లలో రశీదును అందచేస్తున్న వలంటీర్